క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్ డి.సత్యనారాయణ నాన్ టీచింగ్ విభాగంలో ఆగస్టు 15న కలెక్టర్ చేతుల మీదుగా మెరిటోరియస్ అవార్డ్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి మద్దిలి వినోద్‌బాబు, అధ్యాపకులు సాంబశివరావు, లక్ష్మి, కుమారి, కల్యాణి, గణేష్, సత్యనారాయణ, లక్ష్మి, శ్రీధర్, ఉషాకుమారి, లక్ష్మీకాంతం, రమణ, పద్మ, అప్పారావు, శేఖర్, బాబు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వేపగుంట కూడలి వద్ద చిరువ్యాపారులతో కలిసి బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చేయాల్సిన పోరాటం గురించి మహాసభల్లో చర్చిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది ప్రతినిధుల సమక్షంలో పలు తీర్మానాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వై.రాంబాబు, చిరు వ్యాపారులు శ్రీను, గౌరీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతికి సంతాపం



రామయ్యనాయుడు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: గుండెపోటుతో మృతి చెందిన రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కేఎస్‌పి రామయ్యనాయుడు మృతదేహానికి పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్‌తో పాటు పార్టీ పరవాడ నాయకులు బొద్దపు చిన్నారావు, బొద్దపు శ్రీనివాసరావు, కావలి వాసు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

శాస్త్రోక్తంగా పునర్వసు నక్షత్ర హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో బుధవారం హోమాన్ని నిర్వహించారు. ముందుగా సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బి.సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిరులతల్లికి పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 27వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు.

ఆదర్శ్‌లో టాటా ఇన్నోవేషన్ తరగతులు

పెందుర్తి: ఆవిష్కృ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో టాటా ఇన్నోవేషన్ ప్రత్యక్ష ప్రసారం బుధవారం ప్రారంభమైంది. 300 మంది విద్యార్థులు ఆయా తరగతులకు హాజరయ్యారు. కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ల నీరు.. శుద్ధమేనా?

- బాటిళ్లు, క్యాన్లలో జోరుగా తాగునీటి వ్యాపారం
- మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బల్క్ వాటర్ ప్లాంట్లు
- అనుమతులు, నాణ్యతా ప్రమాణాలపై కానరాని అధికారుల పర్యవేక్షణ



సబ్బవరంలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, గృహ వినియోగదారులకు విక్రయిస్తున్న వాటర్ క్యాన్లు



ఆదిరెడ్డిపాలెం సమీపంలోని ఆర్‌వో ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేసే ఆర్‌వో మిషన్

సబ్బవరం: మండలంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ల పేరిట తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రెండు మూడు వాటర్ ప్లాంట్లు కనిపిస్తున్నాయి. ఒక్క సబ్బవరం మండలంలోనే 21 వరకూ వాటర్ ప్లాంట్లు, బల్క్ విక్రయ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. పలు చోట్ల పంచాయతీ వాటర్, బోరు నీటిని ఆర్‌వో ద్వారా ఫిల్టర్ చేసి క్యాన్లలో లీటర్ల చొప్పున విక్రయిస్తున్నారు. కంపెనీల వాటర్ క్యాన్ల ధరలు ఎక్కువగా ఉండటంతో తక్కువ ధరకు లభించే ఆర్‌వో వాటర్ కొనుగోలుపై జనం మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా పుట్టగొడుగుల్లా ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. వాటి ఏర్పాటుకు అనుమతులు, పాటించాల్సిన ప్రమాణాలు ఉన్నాయా లేవా? శుద్ధమైన నీటిని విక్రయిస్తున్నారా లేదా అని ఎవరూ పట్టించుకోవడం లేదు.

నిబంధనలు బేఖాతర్..

వాస్తవంగా ఎవరైనా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ముందుగా ఆ ప్రాంతంలో స్థల పరిశీలన చేసి, భూగర్భ జలాలు ఏ స్థాయిలో ఉన్నాయో నిర్ధారించుకోవాలి. ఆ నీటిలో సున్నం, మినరల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో ఫుడ్ సేఫ్టీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. మండల పరిధిలో ముందుగా పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నాణ్యతా ప్రమాణాలను ధ్రువీకరించే ఐఎస్ఐ మార్కు తప్పనిసరి. వాటర్ ప్లాంట్‌కు ఐఎస్ఐ మార్కు రావాలంటే నీటి పరీక్షలు నిర్వహించిన నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలి. దీనికి ఖర్చు కూడా అధికంగానే ఉండటంతో పాటు నాణ్యతా ప్రమాణాల్లో ఏ మాత్రం రాజీపడినా ఐఎస్ఐ ధ్రువీకరణ తిరస్కరించబడుతుంది. చాలామంది వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా, కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా నిర్వహిస్తున్నారు. అదే విధంగా పలు గ్రామాలు, మండల కేంద్రం సబ్బవరంలోని పలు చోట్ల పాడుబడిన భవనాలు, నివాసాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నీటిని క్యాన్లలో విక్రయిస్తూ భూగర్భ జలాలను ఇష్టానుసారంగా వాడుకుంటూ వ్యాపారం చేస్తున్నారు.

మండలంలో ఆర్‌వో ప్లాంట్లు..

మండలంలో అమృతపురంలో-1, అంతకాపల్లిలో-1, ఆరిపాకలో-2, అసకపల్లిలో-1, బాటజంగాలపాలెంలో-2, బోదువలసలో-1, గొల్లలపాలెంలో-2, గొటివాడలో-1, గుల్లేపల్లిలో-1, ఇరువాడలో-1, మల్లునాయుడుపాలెంలో-1, మొగలిపురంలో-1, పైడివాడ అగ్రహారంలో-1, సబ్బవరంలో-2, తవ్వవానిపాలెంలో-1, టెక్కలిపాలెంలో-1, వంగలిలో-1 మొత్తంగా 21 వరకూ ఆర్‌వో ప్లాంట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో నాలుగైదు మినహా మిగిలినవన్నీ కనీసం పంచాయతీ అనుమతులు కూడా లేనివే ఉన్నాయి. మండలంలో పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్ల నీటికి అధిక డిమాండ్ ఉంది. ఈ ప్రాంతాల్లో చాలా మంది ప్లాంట్‌కు వెళ్లి నీరు తెచ్చుకుని వినియోగించుకునే పరిస్థితి కనిపిస్తోంది.

పలు లైసెన్స్‌లూ అవసరమే..

కమర్షియల్ ఆర్‌వో ప్లాంట్ ద్వారా నీటి విక్రయాలకు ఎంఎస్ఎంఈ కింద వ్యాపార సంస్థ నమోదు కావాలి. నాణ్యతా ప్రమాణాల కింద బీఐఎస్, ఐఎస్ఐ ధ్రువీకరణ, ఆహార గ్రేడ్ భద్రత సమ్మతిని నిర్ధారించడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉండాలి. వాణిజ్య లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ బోర్డు నుండి నిరభ్యంతర పత్రంతో పాటు పర్యావరణ రక్షణ నిబంధనలు పాటించాలి. పరిశుభ్రత, నీటి నాణ్యత ల్యాబ్ పరీక్షలు, పెస్ట్ కంట్రోల్, వర్కర్స్ హెల్త్ సర్టిఫికెట్లు, ఎలక్ట్రికల్ లోడ్ మంజూరు వంటివి అవసరం.

శుద్ధి చేసిన నీటి నాణ్యతా ప్రమాణాలు ఇవీ..

ఆర్‌వో ద్వారా శుద్ధి చేసిన తాగునీరు తప్పనిసరిగా ఐఎస్ 10500:2012 లక్షణాలకు అనుగుణంగా ఉండాలి. పీహెచ్ 6.5 నుండి 8.5 టీడీఎస్ కాఠిన్యం మేరకు ఉండాలి. ఫ్లోరైడ్ 1.0 ఎంజీ/లీటర్, నైట్రేట్ 45 ఎంజీ/లీటర్ ఆర్సెనిక్ 0.01 ఎంజీ/లీటర్, సూక్ష్మజీవులు నిల్‌గా ఉండాలి.



ఆర్డర్‌పై సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంచిన వాటర్ బాటిళ్లు



ప్లాంట్‌లో నీటిని నింపేందుకు సిద్ధంగా ఉంచిన క్యాన్



విక్రయానికి సిద్ధంగా ఉంచిన వాటర్ బ్యాగ్‌లు

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు..



మండలంలో ఎక్కడ పడితే అక్కడ ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని సమాచారం ఉంది. ఇటీవల గుల్లేపల్లిలో నిర్వహిస్తున్న ఆర్‌వో ప్లాంట్‌ను పరిశీలించాం. నిబంధనల మేరకు ప్లాంట్‌ను నిర్వహించాలని, లైసెన్స్‌ను విధిగా ప్లాంట్‌లో ప్రదర్శించాలని తెలిపాం. అదే విధంగా పంచాయతీ అనుమతులు లేకుండా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయకూడదని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటాం.

– బి. చైతన్య, ఈవోపీఆర్‌డీ, సబ్బవరం మండలం.

సింహగిరీశుని సన్నిధిలో మాజీ మంత్రి రోజా



ఆశీర్వచనం స్వీకరిస్తున్న మాజీ మంత్రి రోజా

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మాజీ మంత్రి ఆర్.కె.రోజా దంపతులు బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు. వారి వెంట ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఉన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెందుర్తి: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 81వ జయంతి సందర్భంగా చినముషిడివాడలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. పూలమాల వేసి అంజలి ఘటించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి విన్నకోట రాము, నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: 11కేవీ లంకనగర్, సింహాద్రినగర్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ విశాఖ జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ కారణంగా విరాట్‌నగర్ బస్టాప్, ప్రహ్లాదపురం, దత్తసాయినగర్, సింహాద్రినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత కమలాకర్‌కు బాండ్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో రాధ



దాత నరసింహ విశ్వనాథరాజుకు బాండ్ అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం ఇద్దరు దాతలు విరాళాలు అందజేశారు. నగరంలోని ఆశీల్‌మెట్టకు చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.లక్ష 11వేల 116, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన నరసింహ విశ్వనాథరాజు, గుణమణిదేవి దంపతులు లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో సంబంధిత విరాళాన్ని వారు బుధవారం నగదు రూపంలో చెల్లించారు. దాత విశ్వనాథరాజు దంపతులకు ఈవో వి.త్రినాథరావు, కమలాకర్ దంపతులకు డిప్యూటీ ఈవో సింగం రాధ బాండ్‌లను అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైభవంగా సింహాచలేశుని నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బీసీ బాలికల వసతిగృహానికి శంకుస్థాపన



వసతిగృహ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.50 లక్షలతో నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామంలో నిర్మించనున్న బీసీ బాలికల నూతన వసతి గృహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎన్టీపీసీ యాజమాన్యం అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. లంకెలపాలెం, తానాం గ్రామాల్లో బీసీ బాలుర వసతి గృహాలకు అదనపు గదులు అవసరమని స్థానిక నాయకులు కోరడంతో ఎన్టీపీసీ యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు. కాలుష్యంలో చిక్కుకున్న గ్రామాల ప్రజలను ఆదుకోవాలని ఎన్టీపీసీ అధికారులను కోరారు. ఎన్టీపీసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు పరిశ్రమలో ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఎన్టీపీసీ యాజమాన్యానికి ఉందన్నారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో త్వరలో ఓ సమావేశం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, కేఎస్ఆర్, వెన్నల నరసింహారావు, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: రాత్రి సమయంలో ఓ వ్యక్తిని రోడ్డుపై అడ్డుకుని దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలను పెందుర్తి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఎస్ఐ డి.సూరిబాబు వెల్లడించారు. పెందుర్తి మండలం కరకవానిపాలేనికి చెందిన సింగంపల్లి సంతోష్ రవికుమార్ ఎయిర్‌పోర్టులో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో రాంపురం హైవే వద్ద పెందుర్తికి చెందిన నిందితులు ఉడతా దేవేంద్ర కుమార్ అలియాస్ బాలు, షేక్ సాహిల్, కామాక దిలీప్‌కుమార్ సంతోష్‌ను అడ్డుకున్నారు. రాళ్లు పట్టుకుని బెదిరిస్తూ రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే తనవద్ద నగదు లేదని చెప్పగా..సంతోష్ వద్ద బ్యాగ్ బలవంతంగా లాక్కుని, అందులోని పర్స్‌లో రూ.1000 తీసుకున్నారు. అనంతరం రాయితో బాధితుడి మొహంపై మోది ఎవరికైనా విషయం చెబితే చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి జారుకున్నారు. దాడి నుంచి తేరుకున్న బాధితుడు సంతోష్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు, పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలోని బృందం నిందితులను బుధవారం పట్టుకుని అరెస్ట్ చేసింది. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీలు నాగరాజు, పేరయ్యనాయుడు, పద్మజ, పీసీలు శివప్రసాద్, శ్రీనివాసరావు, సింహచలం నాయుడు, దేముడునాయుడు, తాతారావును ఉన్నతాధికారులు అభినందించారు.

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

సబ్బవరం: ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ సత్యనారాయణ అన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకు బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకాలను, వినియోగాన్ని నిషేధించామని, వినియోగదారులు ప్రత్యామ్నాయంగా కాటన్ సంచులను వినియోగించాలని కోరారు. షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను వినియోగించినా, ఎక్కడ పడితే అక్కడ నిర్లక్ష్యంగా వేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో ఈవోపీఆర్‌డీ చైతన్య, సబ్బవరం పంచాయతీ కార్యదర్శి మహేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవ సంస్కృతిని నిర్మిద్దాం

- అశ్లీల నృత్యాలను ఆపేద్దాం
- పెందుర్తి పోలీసుల సత్సంకల్పం
- జంక్షన్లలో ఫ్లెక్సీల ద్వారా అవగాహన



అశ్లీల నృత్యాలు వద్దంటూ అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెందుర్తి: 'మహిళలతో అశ్లీల నృత్యాలు చేయించడం మంచి సంస్కృతి కాదని, వాటిని నిషేధిద్దాం' అని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. 'ఒక్కసారి ఆలోచిద్దాం– నవ సంస్కృతిని నిర్మిద్దాం' నినాదంతో పెందుర్తి సర్కిల్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి అలవాట్లను నేర్పించడానికి ప్రయత్నం చేయాలి తప్ప ఇలాంటి అసభ్యతను కాదన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రికార్డింగ్ డాన్స్‌లకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలు, పండగల్లో రికార్డింగ్ డాన్స్‌లు, ఇతర అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రపంచస్థాయి పారా వాలీబాల్ పోటీలకు ఎంపిక



మాట్లాడుతున్న శివదత్

సీతంపేట: అమెరికాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యాంగులైన అన్నం గణేష్, వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ వివరాలు వెల్లడించారు. బెంగళూరులో ఇటీవల జరిగిన సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, ఈ ప్రపంచ స్థాయి పోటీలకు వారు అర్హత సాధించారని శివదత్ తెలిపారు. గతంలో పారా వాలీబాల్ విభాగంలో విజయనగరానికి చెందిన దివ్యాంగురాలు బి. వరలక్ష్మి గెలుపొందారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి జంపా నాగసంతోష్ రావు, డైరెక్టర్లు దుండంగి స్వరూప్, చుక్కా గణేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మానవహారం నేడు

మత్రిపాలెం: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా అఖిల భారత అంగన్‌వాడీ యూనియన్ బ్లాక్‌డే నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ యూనియన్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యాప్ భారం తగ్గించాలని కోరుతూ మానవహారం చేపడుతున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిలుపుదలకు వినతి



ఈపీడీసీఎల్ ఏఈ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొల్లి కృష్ణ తదితరులు

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం శాఖా గ్రంథాలయం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సబ్బవరం ప్రధాన రహదారిని ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలని పలువురు స్థానికులు డిమాండ్ చేశారు. దీనిపై సబ్బవరంలోని ఈపీడీసీఎల్ సెక్షన్-1 కార్యాలయంలో ఏఈ అశోక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. సబ్బవరం శాఖా గ్రంథాలయం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఇక్కడే ఉండటంతో చిన్నారులు సంచరించే అవకాశం ఉందన్నారు. దీనిపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కొల్లి కృష్ణ, బంతికోళ్ల పద్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.